క్లుప్తంగా

చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభించిన శ్రీనివాసులురెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: వేసవిలో ప్రజలు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈచలివేంద్రాలు ఏర్పాటుచేసిన గొందేశి యువసేన, కైఫ్ ఫ్రెండ్స్‌సర్కిల్ సభ్యులను ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి అభినందించారు. ఆదివారం బాలాజీపేట సెంటర్‌లోని స్వర్గీయ గొందేశి పూర్ణచంద్రారెడ్డి విగ్రహం వద్ద గొందేశి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గొందేశి యువసేన నేతలు సూరంపూడి ప్రకాష్, రాయుడుప్రసాద్, రెడ్డి ప్రసాద్, వడ్డీ రాజా, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల అను, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ సభ్యులు సుమన్‌పాల్, కెవి.సుబ్బారెడ్డి, సీతారాంచరణ్, కైఫ్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంబార్కేషన్ పాయింట్ రద్దు కూటమి ప్రభుత్వ వైఫల్యమే

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ ఆరీఫ్



ప్రకాశం నగర్ : హజ్ యాత్రికుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్లు కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం ఆంధ్రరాష్ట్రంలోని ముస్లింలకు కూటమి సర్కార్ ఇచ్చిన వెన్నుపోటు రంజాన్ తోఫా అని, ఇది కూటమి ప్రభుత్వ వైఫల్యమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ ఆరీఫ్ విమర్శించారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆరీఫ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోని మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నిర్లక్ష్యం వల్లే విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ రద్దు అయిందన్నారు. దశాబ్దాల తరబడి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, వంటి ఇతర రాష్ట్రాల నుంచి హజ్ యాత్రకు వెళుతున్న ఆంధ్ర ముస్లింల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ సాధించామని అన్నారు. 2023లో మన రాష్ట్రం నుంచి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1,813 మంది హజ్ యాత్రకు వెళ్లారని చెప్పారు. 2024 ఎన్నికల కోడ్ వెలువడక ముందే 14.04 కోట్ల రూపాయలు హజ్ యాత్రికులకు మంజూరు చేసిందన్నారు. దీనికి సంబంధించిన వివరాలు రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా ప్రభుత్వానికి పంపామని అన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు పెండింగ్‌లో ఉంచారని అన్నారు. మైనారిటీ శాఖ మంత్రి పవిత్ర హజ్ యాత్రకు సంబందించిన బిల్లు మంజూరు చేయించు కోలేక పోవడం సిగ్గు చేటని విమర్శించారు.

జిల్లాలో క్షయ తగ్గుముఖం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో క్షయ వ్యాధి క్రమేపి తగ్గుముఖం పడుతోందని జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారిణి డాక్టర్ ఎస్. వసుంధర తెలిపారు. మార్చి 24 క్షయవ్యాధి దినోత్సవం సందర్బంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లో ప్రస్తుతం 2864 మంది సాధారణ క్షయ వ్యాధి గ్రస్తులు, 47 మంది మొండి క్షయ వ్యాధి గ్రస్తులు ఉన్నారన్నారు . జిల్లాలో గత మూడేళ్ల గణాంకాలు పరిశీలిస్తే ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులల్లో నమోదు అయిన క్షయ వ్యాధి గ్రస్తుల వివరాలు 2022లో 3098 టీబీ కేసులు, 2023 లో 2905 టీబీ కేసులు, 2024లో 2817 కేసు నమోదు అయ్యాయని తెలిపారు. ఈ మూడేళ్ళలో మరణాల సంఖ్య కూడా మూడు శాతం నుంచి 1.5 శాతానికి తగ్గిందన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సందర్భంగా క్షయ రహిత గ్రామా పంచాయతీలకు, వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు, టీబీ నివారణ కోసం పాటుపడిన సేవకులకు కలెక్టర్ చేతుల మీదగా బహుమతి ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు.

విద్యార్థినికి అభినందన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో బయో టెక్నాలజీ విభాగం నుండి డాక్టర్ కె.అనూష మెంటార్ షిప్‌లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో సమ్మర్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్–2025నకు పి.సాయిశ్రేయ ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె తెలిపారు. అమిటీ యూనివర్సిటీ కోల్‌కతాలో డాక్టర్ భట్టాచార్య ఆశీమ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు.

బృందావనకాలనీలో ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీనగర్ బృందావన్‌కాలనీలో ఆదివారం ఉదయం శ్రీ వరసిద్ది వినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కోరుకొండకు చెందిన ప్రముఖ నాడీ వైద్యులు ఎస్.రాధాకృష్ణ కీళ్ల నొప్పులు, పక్షవాతం, నరాల బలహీనత ఉన్న 100మందికి వైద్యసేవలు అందించారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్‌లు ఉన్నికృష్ణ, దినేష్‌లాల్, ఆకులశ్రీనివాస్, కోటసత్తిబాబు, ఆలయ కమిటీ చైర్మన్ చిరట్ల రవికుమార్, వైస్‌చైర్మన్ జి.ఈశ్వరరావు, కోశాధికారి శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

ఘాట్ పవిత్రతను కాపాడండి



ఆధునికంగా ఏర్పాటు చేసిన రెండు క్యాప్సుల్స్



నిర్మాణం పూర్తి చేసుకుని వేలానికి సిద్ధమైన 10 షాపులు

- ఈట్ స్ట్రీట్‌లో మాంసాహార అమ్మకాలు నిషేధించాలి
- నగర పాలక సంస్థ అధికారులు దృష్టి సారించాలని పలువురి వినతి

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రక రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్ పవిత్రతను కాపాడేందుకు అధికారులు కృషి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దేశంలో అతి పెద్ద గోదావరి ఘాట్‌గా ప్రసిద్ధి చెందిన కోటిలింగాల ఘాట్‌లో నగరపాలక సంస్థ ఈట్ స్ట్రీట్ నిర్మాణం చేపట్టి ప్రారంభోత్సవానికి సిద్ధం కావడంతో స్థానికుల్లో తీవ్ర అశాంతి, అలజడి రేకెత్తిస్తోంది. పరమ పవిత్ర క్షేత్రంగా పూజలు అందుకుంటున్న కోటిలింగాల ఘాట్‌లో మత్స్యమాంసాదులు అమ్మకాలు సాగించే విధంగా ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేసే విధంగా నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కోటిలింగాల ఘాట్‌లో నిత్యం అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కోటి యాభై లక్షల రూపాయలతో కోటిలింగాల ఘాట్లో నూతన హంగులతో ఈట్ స్ట్రీట్‌ను నగర ప్రజలకు అందించేందుకు తయారు చేసింది. ఆహ్లాదకరమైన సాయంత్రం వేళలో గోదావరి ఘాట్‌లో సేద తీరేందుకు వచ్చే పర్యాటకులు, సందర్శకుల కోసం తయారు చేసిన పవిత్ర ప్రదేశంలో మాంస విక్రయాలు అమ్మే విధంగా అధికారులు ఆలోచన చేపట్టడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈట్ స్ట్రీట్‌లో 10 షాపులతో పాటు అల్పాహారాలు ఆరగించేందుకు సిట్టింగ్ సౌకర్యంతో కలిగిన రెండు క్యాప్సిల్స్ ఏర్పాటు చేశారు. ఓపెన్ క్యాటగిల్లో రెండు వెండింగ్ జోన్స్ సిద్ధం చేశారు. ఈట్ స్ట్రీట్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. త్వరలోనే నగర పాలక సంస్థ అధికారులు వేలం వేసేందుకు సిద్ధం అవుతుండటంతో స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లే ఘాట్‌లో మత్స్యమాంసాదులు అమ్మకాలను ప్రోత్సహించే విధంగా ఉండటం వలన హిందువుల మనోభావాలు తెబ్బతినే విధంగా ఉందంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లే కోటిలింగాల ఘాట్‌లో కేవలం శాఖాహారమే అమ్మకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. నగర పాలక సంస్థ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని హిందువులు పవిత్రంగా కాపాడుకునే కోటిలింగాల ఘాట్‌లో మాంస విక్రయాలను లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉందని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నగర పాలక సంస్థ నిర్మించిన ఈట్ స్ట్రీట్‌లో కేవలం పూజా సామగ్రి, శాఖాహార పదార్థాలను మాత్రమే విక్రయించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. షాపులు వేలం వేయడానికి ముందు అధికారులు హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు స్థానికులు, మహిళలు సిద్ధం అవుతున్నారు.

ఎవరి మనోభావాలూ దెబ్బతినకుండా చూడాలి



దక్షిణ కాశీగా పేరొందిన కోటిలింగాల ఘాట్‌లో ఏర్పాటు అవుతున్న ఈట్ స్ట్రీట్‌లో హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలి. ఘాట్ విశిష్టతతో పాటు పవిత్రతను కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. దేశంలోనే అతిపెద్ద ఘాట్‌గా రికార్డు పొందిన కోటిలింగాల ఘాట్‌లో ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చెందాల్సిన పరిస్థితి ఉంది. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అపవిత్రతకు తావు లేకుండా ఆధ్యాత్మిక వేత్తల మనోభావాలకు భంగం వాటిల్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– వై.వి.ఎస్.మూర్తి, కోటిలింగాల ఘాట్, రాజమహేంద్రవరం

భక్తులకు ఏర్పాట్లు చేయాలి



ధార్మిక క్షేత్రం కోటిలింగాల ఘాట్‌లో భక్తులు, ప్రజలకు అవసరమయ్యేవాటిని మాత్రమే ఏర్పాటు చేయాలి. నూతనంగా ఈట్ స్ట్రీట్ ఏర్పాటుతో ఘాట్ అభివృద్ధి చెందుతుంది. ఘాట్ అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు. ప్రజల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఏర్పాటు జరిగితే మనోభావాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. పుష్కరాలకు అధిక సంఖ్యలో భక్తులు, సందర్శకులు వచ్చే అవకాశం ఉంది. ఘాట్‌లో ఈట్ స్ట్రీట్ షాపులు వేలం వేయడానికి ముందు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళతాం.

– తమ్మన శ్రీనివాసరావు, హ్యూమన్‌రైట్స్ జిల్లా చీఫ్, రాజమహేంద్రవరం

పన్ను చెల్లించని వారిపై చర్యలు

- అత్యవసర సేవలు నిలిపివేస్తాం
- నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్



రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థకు పన్నులు వెంటనే చెల్లించి నగరాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. ఆదివారం ఆర్ఎంసీ అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందికి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేతన గార్గ్ ఆదేశాలు జారీ చేస్తూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వారం రోజులలో ముగియనున్నందున పన్నుల వసూళ్లు వేగవంతం చేసి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పన్నుల వసూళ్ల ప్రగతిపై డిప్యూటి కమిషనరు, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పరిపాలనా కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటి వరకు ఆస్తిపన్ను రూపేణా రూ.60.71 కోట్లు వసూలయ్యాయని, ఇంకా సుమారు రూ.10.00 కోట్లు వసూలు చేయాల్సి వుందన్నారు. నీటి చార్జీలు కూడా రూ.2 కోట్లు మేర వసూలు చేయాల్సి ఉందన్నారు. బకాయిలు వున్న వారికి నోటీసులు ఇవ్వాలని, పన్ను చెల్లించని వారి ఇంటికి అత్యవసర సర్వీసులైన కుళాయి, కరెంటు కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. ఉగాది, రంజాన్ సందర్భంగా 30, 31 తేదీలు వరుసగా సెలవులు వచ్చినందున వసూళ్లు 29వ తేదీలోగా పూర్తి చేయాలని అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్సులో డిప్యూటి కమిషనర్ ఎస్.వి.రమణ, రెవెన్యూ అధికారులు కె.బి.ఆర్.రవికుమార్, సీహెచ్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు భవన నిర్మాణాలు



అపార్ట్‌మెంట్ ప్లాన్ చూస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగర పరిధిలోని భవనాలు నిబంధనల మేరకు నిర్మించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ ఖర్గ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో గాదాలమ్మనగర్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ ఆక్యుపెన్సీ ఫైల్‌ను పరిశీలించారు. భూగర్భ జలాల పెంపు కోసం నిర్మించిన వర్షపు నీటి సంరక్షణ గుంతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం ఎత్తు, సెట్ బ్యాక్‌లు, అపార్ట్‌మెంట్‌కు యాక్సెస్ కలిగిన రహదారి వెడల్పు, పట్టణ నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. భవనం రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌గా మంజూరు పొంది, అనుమతి ప్రణాళికకు ఎటువంటి వ్యత్యాసం లేకుండా నిర్మించడం అభినందనీయమన్నారు. సంబంధిత అధికారులు భవన పరిపాలన నిబంధనలను క్రమంగా పాటిస్తూ, పట్టణప్రణాళికకు అనుగుణంగా భవన నిర్మాణాలను నిర్ధారించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానరు జి.కోటయ్య, డిప్యూటి సిటీ ప్లానరు సత్యనారాయణ రాజు, పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు పాల్గొన్నారు.

12న పురస్కారాల ప్రదానోత్సవం

సీటీఆర్ఐ: భారతదేశానికి దశ దిశ చూపిన మహానుభావులు పూలే, అంబేడ్కర్ పేరిట మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర దళిత సేన అధ్యక్షుడు జె.బి.రాజుకు పురస్కారాలు అందచేయనున్నట్లు రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సొసబోయిన రామారావు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 వ తేదీ సాయంత్రం 4 గంటలకు జె.ఎన్.రోడ్డులోని చెరుకూరి కళ్యాణ మండపంలో జరిగే సభలో ఈ పురస్కారాలు అందచేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాల కార్యక్రమాలకు సహాయం అందించే ఆదిరెడ్డి అప్పారావుకు పూలే పురస్కారం, సంఘ సేవకులు, రాష్ట్ర దళిత సేన అధ్యక్షుడు జె.బి.రాజుకు అంబేద్కర్ పేరిట అవార్డు అందచేస్తామని చెప్పారు.

ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి



దొమ్మేటి వెంకటరెడ్డికి నివాళులర్పిస్తున్న నేతలు

కడియం: సంఘ సంస్కర్త, విద్యాదాత, స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతి సందర్భంగా కడియం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక శెట్టిబలిజ నాయకుల ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్‌లకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రధాన రహదారిలో స్థానికులకు, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యతతో అందరూ కలిసి మెలిసి ముందుకు సాగాలని, సంఘం కోసం ప్రతి ఒక్కరూ పోరాడుతూ, పాటు పడాలన్నారు. స్తోమత లేక విద్యకు దూరమైన బడుగు బలహీన వర్గాల పిల్లలకు పాఠశాల వద్దే భోజనం ఏర్పాట్లు చేసి విద్యను అందించిన విద్యాదాత దొమ్మేటి వెంకటరెడ్డిని స్మరించుకుంటూ, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన కీర్తిని కొనియాడారు. స్థానిక శెట్టి బలిజ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

భీమన్న సాహిత్యం నేటి తరానికి ఆదర్శం

- బోయి భీమన్న జీవితం – సాహిత్యంపై జాతీయ సదస్సు
- వంద మందికి సర్టిఫికెట్ల ప్రదానం



సదస్సులో మాట్లాడుతున్న బోయి హైమావతి తదితరులు



నగదు పురస్కారాన్ని అందుకున్న కవులు

సీటీఆర్ఐ: భీమన్న సాహిత్యం నేటి తరానికి ఆదర్శం అని భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ చైర్‌పర్సన్ బోయి హైమావతి అన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు అసోసియేషన్ నేషనల్ అకాడమీ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో భీమన్న జీవితం సాహిత్యం జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ టి.పార్థసారధి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బోయి భీమన్న సతీమణి హైమావతి ప్రసంగించారు. నేటి ఆధునిక కవులకు భీమన్న సాహిత్యం ఒక దిక్సూచిలా నిలుస్తుంది అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయం అన్నారు. శ్రీ శ్రీ కళా వేదిక సీఈవో కత్తి మండ ప్రతాప్ మాట్లాడుతూ సాహిత్యం సమాజహితమని సదస్సులో వందమంది పత్ర సమర్పణ చేయడం అభినందనీయం అన్నారు. నన్నయ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ భీమన్న సాహిత్యంలో అనేకమంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాను పొందారన్నారు. బోయి భీమన్న జీవిత చరిత్ర పై జరిగిన కవిత పోటీలలో 15 మంది విజేతలుగా నిలిచారు. వీరికి సర్టిఫికెట్లతో పాటుగా నగదు పురస్కారం అందించారు. వీరితో పాటుగా మరో వంద మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, ప్రధాన కార్యదర్శి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ టి.పార్థసారధి, జాతీయ కల్చరల్ డైరెక్టర్ డేబా విజయ్ కుమార్, నూకా సంపత్, బాలార్జున సత్యనారాయణ, బి.వి.వి. సత్యనారాయణ, తాటి హరీష్, కాపురపు రవికుమార్ పోషణ జాతీయకుమార్ పాల్గొన్నారు.

సమాజానికి దిక్సూచిలా సాహిత్యం



సాహిత్యం సామాజిక దురాగతాలపై స్పందించేలా ఉండాలి. కవిత్వంలో జన జీవితాలను రాయాలి. కవిత్వం నేటి వాస్తవ పరిస్థితులపై స్పందించాలి. అప్పుడే ఆ కవిత్వానికి, రచయితకు సార్థకత చేకూరి ఆ కవిత్వం పది కాలాలపాటు నిలుస్తుంది. కవులు కళాకారులను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నెల నెలా ఒక్కో జిల్లాలో జాతీయ స్థాయిలో శతాధిక కవిసమ్మేళనాలు, సాహిత్య సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇంతవరకు 146 జాతీయ కార్యక్రమాలు నిర్వహించి వేలాదిమంది కళాకారులను ప్రోత్సహించాం.

– కత్తిమండ ప్రతాప్, శ్రీ శ్రీ కళావేదిక సి.ఈ.ఓ, బోయి భీమన్న కవి పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత, కవి

దళితుల ఆత్మగౌరవం... బోయి భీమన్న



కూడు లేక, గూడులేక, కడు పేదరికంలో హీనంగా, దీనంగా ఆకలి కేకలతో విలపిస్తున్న దళితుల గోడు వినేవారు లేరని బోయిభీమన్న తన కవిత్వంలో వెల్లడించారు. దళితుల ఆత్మగౌరవాన్ని నిలిపిన శక్తి బోయి భీమన్న. చైతన్య శక్తిగా దళిత కవిత్వం కొనసాగించారు.

– గొట్టిముక్కల నాసరయ్య, కవి, రచయిత, ప్రకాశం జిల్లా

బహుమతి గెలుచుకోవడం ఆనందం



డాక్టర్ బోయి భీమన్న జీవితం సాహిత్యం అనే అంశంపై రాజమహేంద్రవరం పట్టణంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రోత్సాహక బహుమతిని గెలుచుకోవడం ఆనందదాయకంగా ఉంది. కవిత్వానికి పట్టం కట్టి, సాహిత్యాన్ని దేశ విదేశాలలోనే కాక మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరింప చేస్తూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీస్తూన్న శ్రీశ్రీకళావేదికని అభినందిస్తున్నాను.

– పూర్ణిమ ఎర్రంశెట్టి, భద్రాచలం

కులమతాలకు అతీతంగా...



బోయిభీమన్న మంచి సామాజిక మార్పు కాంక్షించిన క్రాంతిదర్శి. పద్మశ్రీ, పద్మభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎదిగిన గొప్ప వ్యక్తి. కుల మతాలకు తావులేకుండా సమానత్వం కలిగి ఉండాలన్నదే బోయిభీమన్న తన సాహిత్యంలో సూచించారు.

– డాక్టర్ టి. పార్థసారథి, జాతీయ ప్రధాన కార్యదర్శి, కొయ్యలగూడెం

కవన సేద్యం చేస్తున్నందుకు కృతజ్ఞతలు



రాజమహేంద్రవరంలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ సదస్సులో బహుమతిని స్వీకరించడం చాలా ఆనందంగా ఉంది. కవన సేద్యం చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక, భీమన్న సాహితీ నిధి ట్రస్టు, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏపీ భాషా సాంస్కృతిక శాఖకి కృతజ్ఞతలు.

– కాపురపు రవికుమార్ (విరాగి), మంచిర్యాల

యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా పోరాటం

కంబాలచెరువు: విశ్వవిద్యాలయాలను విధ్వంసం చేసే యూజీసీ నూతన నిబంధనలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని, సామ్రాజ్యవాద ఫాసిస్టు దాడులను ఖండించాల్సిన అవసరం ఉందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక బీసీ బాలుర వసతిగృహంలో షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ల 94 వర్ధంతి సందర్బంగా ఆయన భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా నాయకులు కె.భాను ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మణికంఠ, పట్టణ అధ్యక్షులు దేవేష్ పాల్గొన్నారు.

రేపు వివిధ వస్తువులకు వేలం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పోరేషన్ లిమిటెడ్(ఏపీఎస్‌బీసీఎల్) రాజమహేంద్రవరం డిపో పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వస్తువులను ఈ నెల 25వ తేదీ ఉదయం 10గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీఎస్‌బీసీఎల్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్(ఇన్‌చార్జి) ఎం.అబ్దుల్‌ఖదీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, ఏపీఎస్‌బీసీఎల్ డిపోమేనేజర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం హార్లిక్స్‌ఫ్యాక్టరీ పక్కన ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని దాసరి సీతారామకృష్ణ గోడౌన్ వద్ద వేలం జరుగుతుందన్నారు. సమాచారం కోసం94407 85620, 99493 51052 నంబర్లలో సంప్రదించాలన్నారు.

డ్రీమ్స్ విశ్వవిద్యాలయం స్థాయికి చేరాలి : మంత్రి దుర్గేష్



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ధవళేశ్వరం: డ్రీమ్స్ విద్యాసంస్థలు విశ్వవిద్యాలయం స్థాయికి చేరాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్‌లో జరిగిన డ్రీమ్స్ 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఈ విద్యా సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డులను మంత్రి అందజేశారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కేజీ నుంచి పదవ తరగతి వరకు విద్యను అందిస్తున్న డ్రీమ్స్ విద్యాసంస్థలు భవిష్యత్తులో విశ్వవిద్యాలయంగా మారాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఈ విద్యాసంవత్సరంలో విశేష ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ అంగర రమేష్, స్కూల్ ప్రిన్సిపాల్స్ వి.సంధ్యారాణి, జి విమలారోజ్, ఎన్ దీపిక, వేమగిరి డ్రీమ్స్ ఫస్ట్ స్టెప్ ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ కె లలితాదేవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ త్యాగం ఆదర్శం కావాలి



కడియంలో భగత్‌సింగ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

కడియం: స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ చేసిన ప్రాణత్యాగం నేటి యువతరం అర్థం చేసుకోవాలని ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు, భగత్ సింగ్ సేవా సమితి అధ్యక్షుడు తమ్మిశెట్టి ప్రసాద్ అన్నారు. కడియంలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని తమ్మిశెట్టి ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు. ఈ మేరకు స్థానిక బొబ్బిలి బ్రిడ్జి సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. నేటి యువత వారి త్యాగాలను గుర్తుంచుకుని సామాజిక బాధ్యతతో, దేశభక్తితో మెలగాల్సిన అవసరం ఉందన్నారు. పాఠ్యపుస్తకాల్లో ఈ పోరాట యోధుల చరిత్రలు పాఠ్యాంశాలుగా ఉండాలన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, స్థానిక ప్రముఖులు అడపా సుబ్రహ్మణ్యం, కొత్తూరి బాలనాగేశ్వరరావు, తోరాటి శ్రీనివాసరావు, కళ్యాణం సూరిబాబు, కొత్తూరి కృష్ణ, కోటిపల్లి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో భగత్‌సింగ్ వర్ధంతి

కంబాలచెరువు: భారతదేశ స్వాతంత్ర్యం కోసం అసమాన పోరాటం చేసిన విప్లవకారుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 94వ వర్ధంతిని ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ విగ్రహానికి సీపీఐ సీనియర్ నాయకులు నల్లా రామారావు, భ్రమరాంబ దంపతుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్లా రామారావు మాట్లాడుతూ నేటి యువత అమరవీరులు భగత్ సింగ్, సుఖదేవ్,రాజ్‌గురులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నల్లా రామారావు, బ్రమరాంభ దంపతులు అభినందనీయులన్నారు. అల్లంకి మణికంఠ, బళ్ళా రాజు, కొడమటి బవర్రాజు, నల్లా లెనిన్, గుత్తి నాగు, కేటీ శ్రీనివాస్, కే హిమబిందు, రెడ్డి బోస్, బత్తుల సోమశేఖరరావు, కర్రి మురళీకృష్ణ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



భగత్‌సింగ్ విగ్రహానికి జోహార్లు అర్పిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్‌ల ఆశయం వృధా పోకూడదని, యువత సన్మార్గంలో నడవాలని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ లంక సత్యనారాయణ కోరారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94 వ వర్ధంతి నిర్వహించారు. లంక సత్యనారాయణ మాట్లాడుతూ ఆ ముగ్గురు మహావీరుల త్యాగం వృథా కాకుండా యువత చూడాలని కోరారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలు ధనార్జన చేస్తున్నారని వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి దేవత సుధాకర్, కేఎల్ఎన్‌రెడ్డి, యరగ్రొండ సూరిబాబు, తంగేటి దుర్గా ప్రసాద్, కె.వి.రమేష్ బాబు, వై.కె.ఎల్., ఎం.సుధాకర్ పాల్గొన్నారు.